రుగ్వేద కాలంలో ఆర్యుల ఆర్థిక జీవనం

పేపర్-2, యూనిట్-1

సింధు నాగరికత

Q సింధు నాగరికత వారసత్వాన్ని పరిశీలించండి? (లేదా) భారతీయ సంస్కృతిపై సింధు నాగరికత ప్రభావాన్ని విశ్లేషించండి?

A సమాధానంలో ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశాలు

- సింధు ప్రజల మత విశ్వాసాలు, ముఖ్యంగా అమ్మతల్లి తదనంతర కాలంలో 'శక్తి' ఆరాధన, గ్రామ దేవతల ఆరాధన కొనసాగడం; పశుపతి రూపంలో శివుడిని ఆరాధించడం; శివుడిని పద్మాసనంలో కూర్చున్న మహాయోగిగా భావించడం వంటి భావనలు కొనసాగడం; దుష్టశక్తులను తాయెత్తుల సహాయంతో ఎదుర్కోవాలనుకోవడం; ఎద్దును పవిత్రంగా భావించడం (నేటికీ నందీశ్వరుడిగా ఆరాధిస్తుండటం) తదితర అంశాలను మొదట వివరించాలి.
- పత్తి పంట, పత్తి వస్త్రాలు, భారతీయ వస్త్రాలు ప్రపంచ ప్రఖ్యాతి పొంది విదేశీయులను ఆకర్షించడం
- సింధు ప్రజలు వృద్ధి చేసిన వ్యవసాయ పరిజ్ఞానం, ఇతర సాంకేతిక నైపుణ్యాలు భారత దేశంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించడం
- సింధు ప్రజలు మధ్య ఆసియా, పశ్చిమాసియా వరకు ఏర్పరచుకున్న వాణిజ్య మార్గాలు, సంబంధాలు కొనసాగి భారత చరిత్ర, సంస్కృతిని ప్రభావితం చేయడం
- ఇప్పటికీ వాయవ్య భారతదేశంలో సింధు ప్రజలు పండించిన పంటలు, వారి ఆహారపు అలవాట్లు, గృహ నిర్మాణ పద్ధతులు కొనసాగడం
- సంఖ్యామానంలో సింధు ప్రజలు '16'కు ఇచ్చిన ప్రాధాన్యం కొనసాగడం (కొన్నేళ్ల క్రితం వరకు రూపాయికి పదహారు అణాలు ఉండటం; కానుకల చదివింపుల్లో నూట'పదహార్లు'కు గల ప్రాధాన్యం తదితర)

Q సింధు నాగరికత వైశిష్ట్యాన్ని వివరించండి?

సూచన: ఈ ప్రశ్నకు సమాధానంగా సగటు అభ్యర్థులు సింధు నాగరికత లక్షణాలనే రాసే ప్రయత్నం చేస్తారు. కానీ ఈ నాగరికతకు సంబంధించిన విశిష్ట అంశాలను మాత్రమే ప్రస్తావిస్తూ.. ప్రపంచ, భారతదేశ చరిత్రలో ఆ నాగరికతకు ఉన్న విశిష్ట స్థానాన్ని వివరించాలి.

A ప్రాచీన నాగరికతలన్నిటిలో (మెసొపొటేమియా, ఈజిప్ట్ వంటి నాగరికతలతో పోల్చితే) సింధు నాగరికత అతి పెద్ద విస్తీర్ణం కలిగుండటం

- ఈ నాగరికతలో కనిపించే పారిశుద్ధ్య ఏర్పాట్లు మరే సమకాలీన నాగరికతల్లో కనిపించకపోవడం



- ప్రపంచానికి తొలిసారి పత్తిని పరిచయం చేయడం
- వేరే నాగరికతలతో పోల్చితే కాల్చిన ఇటుకలను విస్తారంగా వినియోగించడం;
- ఇప్పటికీ అంతుచిక్కని విశిష్ట లిపి
- మత విశ్వాసాలతోపాటు అనేక అంశాలు నేటికీ భారత సంస్కృతిలో కొనసాగడం
- ఈజిప్ట్, మెసొపొటేమియాలతో పోల్చితే మతపర నిర్మాణాలేవీ ప్రధానంగా కనిపించకపోవడం

వైదిక సంస్కృతి

పేపర్-2, యూనిట్ -1 లోని మరో ముఖ్య అంశం వైదిక సంస్కృతి. దీనిని రెండు కాలాలుగా విభజించవచ్చు. అవి.. తొలి వేద లేదా రుగ్వేద కాలం (క్రీ.పూ. 1500-1000). మలివేద కాలం (క్రీ.పూ.1000-600). ఈ విభజన ఆధారంగా ఆర్థిక పరిస్థితులు, సమాజం, మతం, రాజకీయ పరిస్థితులు వంటి అంశాలపై ప్రత్యేకంగా ప్రశ్నలు అడగొచ్చు. వైదిక సంస్కృతిపై కొన్ని ముఖ్య ప్రశ్నలు

Q రుగ్వేద సమాజాన్ని పరిశీలించండి?

A రుగ్వేద కాలం (క్రీ.పూ. 1500 - 1000) నాటి ఆర్య సమాజం చాలా వరకు సమానత్వంతో కూడుకుంది. పశువులు,గుర్రాల వంటి జంతువుల్ని కలిగుండటంలో హెచ్చు తగ్గులు, లింగ-వయో భేదాలను బట్టి హోదాల్లో తేడాలు వంటివి ఉన్నప్పటికీ, సాంఘిక భేదాలు ముఖ్యంగా పురుషుల విషయంలో అంతగా లేవనే చెప్పొచ్చు.

పితృస్వామిక కుటుంబమే ఆ సమాజానికి పునాది. భార్య, భర్తల తల్లిదండ్రులతోపాటు మూడు, నాలుగు తరాలకు చెందిన రక్త సంబంధీకులు కలిసుండటంతో కుటుంబాలు చాలా పెద్దవిగా.. బంధుత్వాన్ని సూచించే పదాలు చాలా సరళంగా ఉన్నాయి. అమ్మ, నాన్న, సోదరుడు, సోదరి, కొడుకు, కూతురు వంటి వరసలకే ప్రత్యేక పదాలున్నాయి. మేనల్లుడు, మనవడు, పినతండ్రి సంతానం వంటి బంధుత్వాలను 'నప్త్రి' (Naptr) అనే ఒకే పదంతో సూచించారు. మాతామహునికి, పితామహునికి ఒకే పదం వాడారు. 'కుల'గా పిలచే కుటుంబాలను కలిపి'విస్'గా... కొన్ని విస్‌లను కలిపి 'జన' (మొత్తం

తెగ)గా వ్యవహరించేవారు. రుగ్వేద తెగలు పచ్చిక బయళ్ల కోసం సంచరించేవి. తర్వాతి కాలంలో సాధారణ విషయమైన వర్ణ వ్యవస్థ రుగ్వేద సమాజంలో లేదు. యోధులు, పూజారులు, సామాన్యులు అనే వర్గీకరణ కనిపిస్తోంది. ఇక, చతుర్వర్ణాల ప్రస్తావన పురుష సూక్తం ప్రక్షిప్తమని పరిశోధకుల నిర్ణయం (రుగ్వేదంలోని 2-7 వరకున్న మండలాలు ప్రాచీనమైనవి, 1, 8, 10వ మండలాలు తర్వాతి కాలానికి చెందినవని వారి భావన. పురుష సూక్తం పదో మండలంలోనే ఉంది)

పితృస్వామిక వ్యవస్థ ఉన్నప్పటికీ, తర్వాతి కాలంలో పోల్చితే స్త్రీల స్థితి రుగ్వేద కాలంలో మెరుగని చెప్పొచ్చు. 'దుహిత్రి' (పాలు పితికే స్త్రీ) వంటి పదాలు, నేత పనిలో వారి ప్రమేయాన్ని బట్టి ఉత్పత్తిలో స్త్రీలు తగురీతిలో పాల్పంచుకున్నారని తెలుస్తోంది. స్త్రీలు 'తెగ' నిర్వహించే సమావేశాల్లో, భర్తలతోపాటు యజ్ఞాల్లో పాల్గొనగలిగేవారు. కొందరు స్త్రీలు రుగ్వేద శ్లోకాల రచయిత్రులుగా కనిపిస్తున్నారు. బాల్య వివాహాలు లేవు. భర్త దూరమైన స్త్రీ 'నియోగ' (Livirate) పద్ధతి ద్వారా సంసార జీవితాన్ని తిరిగి పొందగలిగేది. సాధారణంగా రజస్వలానంతర వివాహాలే జరిగేవి. కొన్ని సందర్భాల్లో స్త్రీలు తమ వయసు పరుషులతో స్వేచ్ఛగా సంచరిస్తూ, ప్రణయ సంబంధాలు కొనసాగించేవారు. వివాహానికి స్త్రీ అనుమతి ప్రధానం. అయితే ఈ కాలంలో స్త్రీలు అత్యున్నత స్థితిని అనుభవించారని చెప్పలేం. సంతానం కోసం చేసిన ప్రార్థనల్లో మగ సంతానాన్నే కాంక్షించేవారు. అలాగే రుగ్వేద మతంలో పురుష దేవతలకున్న ప్రాధాన్యం కూడా పురుషాధిక్య సమాజాన్ని సూచిస్తోంది.

స్థూలంగా సమానత్వంతో కూడిన సమాజమైనా సాంఘిక, ఆర్థిక భేదాలు బలపడేందుకు వీలైన పరిస్థితులు ఈ కాలంలోనే ఏర్పడ్డాయి. యుద్ధాల్లో గెలుచుకున్న వస్తు, పశు సంపదను యజ్ఞాల రూపంలో పంచుకొనేటప్పుడు యోధులు, పూజారులు అధిక వాటా పొంది బలపడ్డారు. సంపద పంపిణీలో ఈ అసమానత్వం తర్వాత కాలంలో తీవ్రమైంది. సాపేక్షంగా చూస్తే రుగ్వేద సమాజం సంతృప్త సమాజంగా కనిపిస్తుంది. యాచకులు, కూలీలు/వేతన జీవుల ప్రస్తావన లేకపోవడం దీనిని బలపరుస్తోంది.

ఈ కాలంలో ఆర్యులు 'దాస, దస్యు, పణి' అనే శత్రు సమూహాల గురించి ప్రస్తావించారు. 'దాస' వర్గం కంటే 'దస్యుల' పట్ల తీవ్ర వైరం ప్రదర్శించారు. కొన్ని సందర్భాల్లో ఆర్య, అనార్య తెగలు పాల్గొన్న సంక్లిష్ట సంఘర్షణలు ఏర్పడ్డాయి. దశరాజ యుద్ధం దీనికి ఉదాహరణ.

Q రుగ్వేద కాలం నాటి ఆర్యుల ఆర్థిక జీవనాన్ని విశదీకరించండి?

A రుగ్వేద కాలం (క్రీ.పూ.1500-1000)లో ఆర్యులు సంచార, అర్ధ-సంచార దశలో (నొమాడిక్ అండ్ సెమీ నొమాడిక్) ఉండి పశుపాలన ప్రధాన వృత్తిగా జీవించారు. ఈ దశలో.. వారి జీవనంలో 'గోవు'కు గల ప్రాధాన్యతను విస్తృతంగా కనిపించే గోసంబంధ పదజాలం సూచిస్తుంది. ఉదా: గోమట్ (సంపన్నుడు-ఎక్కువ గోవులు కలిగున్న వ్యక్తి), గవిష్ఠ (యుద్ధం-గోవుల కోసం అన్వేషణ), గవ్యుతి (దూరం), దుహిత్రి (కూతురు-పాలు పితికే స్త్రీ) తదితరాలు. ఆర్యులు గోవులకవసరమైన పచ్చిక, నీటి వనరుల కోసమే సంచరిస్తూ, సంఘర్షిస్తూ ఉండేవారు. గోసంపదను పొందడంలోని తారతమ్యాలే కొంత మేర సాంఘిక వ్యత్యాసాలకూ కారణం.

ఈ దశలో ఆర్యుల జీవనంలో వ్యవసాయానికి ప్రాధాన్యం స్వల్పం. అందుకే భూమి కోసం లేదా ధాన్యం కోసం సంఘర్షణలు జరగలేదు. దానాల్లో కూడా భూమి ప్రస్తావన లేదు. భూమి కోసం ప్రార్థనలు లేవు. రుగ్వేదంలో కేవలం 'యవ' అనే ఒక్క ధాన్యాన్ని మాత్రమే ప్రస్తావించారు. 'యవ' అంటే బార్లీ అని పరిశోధకుల భావన. (కేవలం 60 రోజుల్లోనే పండి ఆహార అవసరాలను తీర్చడంతోపాటు పశుగ్రాసంగా కూడా ఉపయోగపడటం బార్లీ ప్రత్యేకత). రుగ్వేద కాలంలో భూమిపై వైయక్తిక యాజమాన్యమనే భావన లేదు. తాత్కాలిక పోడు వ్యవసాయం చేసిన ఈ కాలంలో శాశ్వత యాజమాన్యం అనే భావన కూడా మృగ్యం.

తొలి వేద ప్రజలు వ్యవసాయ పరిజ్ఞానాన్ని స్థానికుల నుంచే గ్రహించారని చెప్పొచ్చు. 'నాగలి'ని సూచించే పదం 'లంగల'ను ముండా భాష నుంచి స్వీకరించారు. అంతేకాక ఇండో-యూరోపియన్ భాషల్లో పశువులను సూచించేందుకు ఒకే విధమైన పదజాలాన్ని.. ధాన్యాలు, పంటలకు మాత్రం విభిన్న పదాలను వాడటం ఆ పదాలను స్థానికుల నుంచి స్వీకరించడాన్ని సూచిస్తోంది. చేతి వృత్తుల విషయంలో.. తర్వాత కాలంలో కనిపించే విస్తృత వైవిధ్యం, ప్రత్యేకీకరణ రుగ్వేదంలో కన్పించలేదు. అయితే చర్మకారులు, రథకారులు, లోహకారులు, కుమ్మరులను ప్రస్తావించారు. వీటిని నిమ్న వృత్తులుగా పరిగణించకపోవడం విశేషం. కుటుంబంలో స్త్రీలు నేతపనిలో నిమగ్నమయ్యారు. గొర్రెల నుంచి సేకరించిన ఉన్నితో వస్త్రాలు నేసేవారు. రుగ్వేదంలో పత్తి ప్రస్తావన లేదు. ఈ కాలంలో ప్రస్తావించిన 'అయిస్' అనే లోహాన్ని రాగి లేదా కంచు అని భావించొచ్చు. అయితే వ్యవసాయ పరికరాలకు లోహాన్ని వినియోగించలేదని చెప్పొచ్చు.

తొలి వేద కాలంలో ద్రవ్య ఆర్థిక వ్యవస్థ, 'విపణి' అనే భావన లేదని చెప్పొచ్చు. సంచార పశు పాలకులు వస్తు వినిమయం చేసేవారు. యుద్ధాల్లో దోచుకున్న సంపదను తెగల సమావేశాల్లో పునఃపంపిణీ చేసుకునేవారు. విస్తృతంగా ప్రస్తావించిన 'అంశ', 'భాగ' అనే పదాలు ఆ ఆర్థిక వ్యవస్థలో భాగాల పంపిణీకున్న విలువను సూచిస్తాయి. రాజు సేవలకు బహుమతిగా తెగ ప్రజలు 'బలి' పేరున పశువుల్ని, పాల ఉత్పత్తుల్ని, ధాన్యాన్ని సమర్పించేవారు. తాను పొందిన 'బలి'ని యజ్ఞాలు, దక్షిణ లేదా దాన రూపంలో రాజు ఖర్చు పెట్టేవాడు.

Q రుగ్వేద కాలం నాటి రాజకీయ పరిస్థితులను చర్చించండి?

A రుగ్వేద కాలం నాటి ఆర్యుల రాజ్య వ్యవస్థ 'గిరిజన' స్థాయిలోనే ఉంది. వారి భౌతిక అవసరాలు, ఆర్థిక స్థితిగతులే రాజ్య వ్యవస్థను

నిర్దేశించాయని చెప్పొచ్చు. 'తెగ' నాయకుడిని 'రాజన్' అని పిలిచేవారని.. అతడు ప్రధానంగా యుద్ధాలకు నాయకత్వం వహించేవాడని తెలుస్తోంది. దీంతోపాటు తన సంరక్షణ కోరినవారు, తనను సమర్థించినవారి పట్ల రాజు ఉదారంగా వ్యవహరించేవాడు. రాజు అధికారం ప్రజలకే కానీ ప్రాంతాలకు సంబంధించినది కాదు. పశుపాలన ప్రధాన వృత్తిగా సంచార దశలో ఉన్న సమాజం కనుక 'జన' (తెగ)కు గల ప్రాధాన్యం జనపదానికి లేదు. అందుకే రాజును 'జనస్య గోప' (జన లేదా తెగ సంరక్షకుడు) అని పిలిచారు.

తొలి వేదం కాలంలో రాజును తెగలోని ప్రజలే ఎంపిక చేసేవారని ప్రస్తావనలు సూచిస్తున్నాయి. 'రాజు' అధికారం వంశపారపర్యంగా సంక్రమించే సంప్రదాయం పూర్తిగా బలపడలేదు. రాజుకు పూర్తి స్థాయి ఉద్యోగి బృందం కూడా లేదు. రుగ్వేద ఆర్థిక వ్యవస్థకున్న పరిమితుల వల్లే రాజు సువ్యవస్థీకృత ఉద్యోగి స్వామ్యాన్ని ఏర్పరుచుకోలేకపోయాడు. సేనాని, పురోహిత, గ్రామణి వంటి ఉద్యోగులు పరిమిత విధులు నిర్వర్తించేవారు. పూర్తి స్థాయి సిద్ధ సైన్యం నిర్వహణకు కావాల్సిన ఆర్థిక మిగులు అందుబాటులో లేకపోవడంతోనే 'సైన్యం'గా పని చేసే తెగ ప్రజలపైనే ఆధారపడేవాడు. అందుకే రాజు యుద్ధాల్లో దోచే సంపదలో అధిక భాగాన్ని.. 'బలి' రూపంలో కానుకలు పొందిసంపన్నుడు కాగలిగినా తన బలం కోసం తెగపైనే ఆధారపడేవాడని చెప్పొచ్చు.

తరచుగా తెగ నిర్వహించే సమావేశాలు రాజు అధికారాన్ని నియంత్రించేవి. 'విదాత', 'సభ', 'సమితి' వంటివి ఇలాంటి సమావేశాలే. ఇవి వివాదాలను పరిష్కరించే న్యాయస్థానాలుగా, యజ్ఞ స్థలాలుగా, ఆడి, పాడి, విందులు ఆరగించే ఉత్సవ వేదికలుగా కూడా ఉండేవి. తొలుత 'విదాత' అధిక ప్రాధాన్యాన్ని పొందినట్లు తెలుస్తోంది. ఈ సమావేశాల్లో స్త్రీలు కూడా ఎక్కువగా పాల్గొనేవారు. విదాత ఆర్థిక, సైనిక, మత, సాంఘిక కార్యకలాపాలను కూడా నిర్వర్తించినట్లు తెలుస్తోంది. 'విదాత'లో సంపద పంపిణీ కూడా జరిగేది. అయితే క్రమంగా విదాత ప్రాధాన్యాన్ని కోల్పోయి, 'సభ', 'సమితి' ప్రాధాన్యత పెరిగింది. సభ.. ఎంపికైన కొందరు ప్రతినిధులకే పరిమితం. సభలో పాల్గొన్న స్త్రీని 'సభావతి'గా పిలిచారు. 'సమితి'లో తెగలోని ప్రజలంతా పాల్గొనేవారని తెలుస్తోంది.

ఎక్స్‌పెక్టెడ్ కొశ్చన్స్

- **సింధు నాగరికత పట్టణ సంస్కృతికి సంబంధించిన అంశాలను విశ్లేషించండి?**
- **సింధు నాగరికత, వైదిక సంస్కృతికి మధ్య తేడాలను చర్చించండి?**
- **రుగ్వేద కాలానికి, మలివేద కాలానికీ ఆర్యుల జీవనంలో వచ్చిన మార్పులను చర్చించండి?**
- **సింధు నాగరికత పతనాన్ని చర్చించి, వారసత్వాన్ని విశ్లేషించండి?**

ప్రీవియస్ కొశ్చన్స్

- **రాజకీయ, సామాజిక, ఆర్థిక, మత రంగాల్లో తొలి, మలి వేద ఆర్య నాగరికతల ప్రధాన లక్షణాల మధ్య పోలికలు లేదా వ్యత్యాసాలు పేర్కొనండి**